15-02-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఆత్మ రూపీ దీపంలో యోగం రూపీ నేతిని వేసినట్లయితే ఆత్మ శక్తిశాలిగా అయిపోతుంది"

ప్రశ్న:- ఆత్మ రూపీ బ్యాటరీలో శక్తిని నింపేందుకు ఆధారం ఏమిటి?

జవాబు:- ఆత్మ రూపీ బ్యాటరీలో శక్తిని నింపేందుకు బుద్ధియోగం యొక్క బలం కావాలి. ఎప్పుడైతే బుద్ధియోగ బలంతో సర్వశక్తివంతుడైన తండ్రిని స్మృతి చేస్తారో, అప్పుడు బ్యాటరీ నిండుతుంది. ఎప్పటివరకైతే బ్యాటరీలో శక్తి ఉండదో, అప్పటివరకు జ్ఞాన ధారణ కూడా జరగజాలదు. ఆత్మలో పూర్తి ప్రకాశం రావడానికి సమయం పడుతుంది. స్మృతి చేస్తూ-చేస్తూ పూర్తి ప్రకాశం వచ్చేస్తుంది.

గీతము:- రాత్రి ప్రయాణికుడా అలసిపోకు... (రాత్ కే రాహీ థక్ మత్ జానా...)

ఓంశాంతి. పిల్లలైన మీరు ఇప్పుడు పగలులోకి వెళ్ళేందుకు పురుషార్థం చేస్తున్నారు అని పిల్లలు పాట యొక్క అర్థాన్ని విన్నారు. కొత్త ప్రపంచంలోనైతే ప్రకాశమే ప్రకాశం ఉంది. పాత ప్రపంచంలో అంధకారమే అంధకారం ఉంది. ఇది బ్రహ్మ యొక్క ఘోర అంధకారమయమైన రాత్రి. మీరిప్పుడు పగలులోకి వెళ్తున్నారు. తండ్రి పిల్లలకు చెప్తారు, ఈ బుద్ధియోగాన్ని జోడిస్తూ-జోడిస్తూ అలసిపోవద్దు. ఎంతగా మీరు యోగం జోడిస్తారో, అంతగా ప్రకాశం వస్తుంది. ఆత్మ రూపీ దీపం యొక్క జ్యోతి ఏదైతే ఆరిపోయి ఉందో, అది వస్తూ ఉంటుంది. ఆ విద్యుత్తులోనైతే వెంటనే కరెంటు వచ్చేస్తుంది. కానీ ఆత్మలో పూర్తి ప్రకాశం రావడానికి సమయం పడుతుంది. చివరికల్లా మొత్తం వచ్చేస్తుంది. యోగం జోడిస్తూ ఉండాలి. కారు బ్యాటరీ కూడా రాత్రంతా నిండుతూ ఉంటుంది, అలాగే ఇది కూడా కారు. దీనిలో ఇప్పుడు నెయ్యి సమాప్తమైపోయింది అనగా శక్తి తగ్గిపోయింది. బాబానైతే పవర్ఫుల్, సర్వశక్తిమాన్ అని అంటారు కదా. ఈ బ్యాటరీలోకి బుద్ధి యోగబలంతో తప్పితే శక్తి రాజాలదు. సర్వశక్తివంతుడైన తండ్రితో యోగం జోడించడంతో మాత్రమే మొత్తం బ్యాటరీ నిండుతుంది. బ్యాటరీ నిండకుండా జ్ఞానం కూడా ధారణ అవ్వలేదు. ఘుడియ-ఘుడియ తండ్రి చెప్తారు, నన్ను స్మృతి చేయండి మరియు వారసత్వాన్ని తీసుకోండి అని. మన్మనాభవ, ఇది ఎంత సహజమైన విషయము. మనుష్యులైతే రామ-రామ అని జపిస్తూ ఉంటారు మరియు రామ రాజ్యం కావాలి అని కోరుకుంటారు. కానీ ఇలా రామ-రామ అని జపించడంతో రామరాజ్యం ఏమైనా వస్తుందా. ఈ విధంగా గంగానది తీరంలో కూర్చొని రామ-రామ అని అయితే జన్మ-జన్మాంతరాలుగా ఎంతో జపిస్తూ వచ్చారు. రామరాజ్యము అని దేనినంటారో ఎవరికీ తెలియనే తెలియదు. తప్పకుండా రాముడే రామరాజ్యాన్ని తయారుచేస్తారు. వారి బుద్ధిలోకి సీతా-రాముల రాజ్యం వస్తుంది. ఇప్పుడు, ఆ రామరాజ్యంలోనైతే రాముడికే ప్రశాంతత లేదు. రాజు అయిన రాముడి యొక్క స్త్రీయే అపహరించబడ్డారు అంటే, ఇక ప్రజల పరిస్థితి ఏమిటి? ఇక్కడ, రాజుల యొక్క స్త్రీలు ఎప్పుడైనా అపహరించబడతారా, కానీ వారు సీతా-రాముల కోసం ఈ విధంగా చెప్తారు. ఇవి చాలా అర్థం చేసుకోవాల్సిన విషయాలు. వాస్తవానికి రాముడు అని అయితే పరమపిత పరమాత్మను అనడం జరుగుతుంది. నీవు మాతా-పిత... అని పాడుతారు కూడా. ఇప్పుడు ఏ మాతా-పితల కోసం ఈ విధంగా పాడుతారు? ఒకరేమో లౌకిక మాతా-పిత. వారికైతే ఈ మహిమ చేయరు. తప్పకుండా పరమపిత అనేవారు ఇంకొకరు ఉన్నారు, మరి తప్పకుండా మాత కూడా ఉండాలి. అందుకే పారలౌకిక మాతా-పితకు గాయనం ఉంది. రచయిత ఎవరు అని అడుగుతారు. వెంటనే గాడ్ ఫాదర్ అని చెప్తారు. కనుక వారు మాత-పిత అని ఋజువు అయ్యింది కదా. ఈ సమయంలోనే ఇద్దరు మాతా-పితలు ఉంటారు. సత్యయుగంలో కేవలం ఒక్క మాతా-పితనే ఉంటారు. లౌకిక మాతా-పితలు ఉన్నప్పటికీ, నీవు మాతా-పిత అని ఇక్కడ పాడుతారు. ఈ సమయంలో పిల్లలైన మనకు తండ్రి ద్వారా అపారమైన సుఖం లభిస్తుంది, ఇక ఆ తర్వాత ఒకే మాతా-పిత ఉంటారు. పారలౌకిక మాతా-పిత ద్వారా సత్యయుగ ప్రారబ్ధంగా అపారమైన సుఖం లభిస్తుంది. ఆ మాతా-పితకే గాయనం ఉంది. అయినా కూడా, ఇటువంటి తండ్రిని పిల్లలు స్మృతి చేయడం మర్చిపోతారు. బాబా వచ్చారు అని పిల్లలైన మీరైతే అందరికీ తండ్రి పరిచయం ఇవ్వాలి. ఎల్లప్పుడూ శివబాబా మరియు బ్రహ్మాబాబా అని అంటారు. ప్రజాపిత పేరు అయితే ప్రసిద్ధమైనది. శివబాబా, బ్రహ్మాబాబా. లౌకిక తండ్రి ఉంటారు. వీరు పారలౌకిక పరమపిత. మరి వీరు మాతా-పిత ఎలా అవుతారు - ఇవి చాలా గుహ్యమైన విషయాలు. ఎవరైనా వస్తే మొదట ఇలా అడగండి - పరమపిత పరమాత్మ మీకు ఏమవుతారు? ప్రజాపిత మీకు ఏమవుతారు? అంబ కూడా గుప్తమైనవారు, అలాగే ఈ బ్రహ్మ కూడా గుప్తమైనవారు. ఈ బ్రహ్మ పెద్ద తల్లి. లౌకిక తండ్రి యొక్క నామ, రూప, దేశ, కాలాలైతే అందరికీ తెలుసు. ఇప్పుడు మీరు వారికి పారలౌకిక మాతా-పిత యొక్క నామ, రూప, దేశ, కాలాలను, కర్తవ్యాన్ని తెలియజేయండి. మమ్మాకు కూడా వీరు పెద్ద మమ్మా.

పెద్ద మమ్మా ద్వారా పిల్లలను దత్తత తీసుకుంటారు. కనుక మాతా-పిత కంబైండ్ గా అవుతారు. వీరిని మాతా-పిత లేక బాప్ దాదా అని కూడా అంటారు. ఎవరికైనా అర్థం చేయించడానికి చాలా యుక్తులు కావాలి. పెద్ద బోర్డుపై ఇలా రాయాలి, నిరాకార పరమపిత పరమాత్మను అందరూ స్మృతి కూడా చేస్తారు కానీ వారు మాత-పిత ఎలా అవుతారు అనేది తెలియదు. ఈ మాత్రం కూడా మనుష్యుల బుద్ధి నడవదు ఎందుకంటే విషయాలు చాలా విచిత్రమైనవి, వీటిని తండ్రే వచ్చి వినిపిస్తారు. ఆత్మ, ఓ పరమపిత పరమాత్మ, అని అంటుంది. వారు కూడా ఆత్మనే కానీ వారు సుప్రీమ్. సుప్రీమ్ అనగా పరమ. వారు పరంధామంలో నివసించేటువంటివారు. వారు స్వయమైతే జనన-మరణాలలోకి రారు, వారు వచ్చి మనల్ని పతిత జనన-మరణాల నుండి విడిపిస్తారు. పావన జనన-మరణాల నుండి విడిపించరు. పతిత ఆత్మను పావన ఆత్మగా తయారుచేస్తారు, అందుకే వారిని పతిత-పావన అని అంటారు. మనుష్యులైతే సీతా-రాముల అర్థాన్ని కూడా అర్థం చేసుకోరు. వాస్తవానికి భక్తురాళ్ళు అందరూ సీతలు. ఒక్క ప్రియతముడైన పరమాత్మను స్మృతి చేస్తారు.

తండ్రి అంటారు - పిల్లలూ, ఈ సమయంలో మొత్తం ప్రపంచంలో రావణ రాజ్యం ఉంది, కేవలం లంకలో మాత్రమే కాదు. రావణుడిని కాల్చడం కూడా ఇక్కడే చేస్తారు. లంక, హిందూస్థాన్ లో లేదు. అది బౌద్ధుల ఖండము. కనుక ఈ సమయంలో మొత్తం ప్రపంచం రావణుడి బంధనంలో ఉంది. మొత్తం ప్రపంచంలో రావణుడి రాజ్యం ఉంది. అర్ధకల్పం రామరాజ్యము, అర్ధకల్పం రావణ రాజ్యము. అర్ధకల్పం పగలు, అర్ధకల్పం రాత్రి. ఈ విషయాలన్నీ బుద్ధిలో ఉంచుకోవాల్సినవి. ఈ సమయంలో మీరు రావణుడిపై విజయం పొందుతున్నారు. ఎవరైతే పూర్తి విజయం పొందుతారో, వారే యజమానులుగా అవుతారు. సత్యయుగం ఆదిలో లక్ష్మీ-నారాయణుల రాజ్యం ఉండేది. వారు ఈ స్వర్గ ప్రారబ్ధాన్ని ఎక్కడ నుండి మరియు ఎలా పొందారు. సత్యయుగంలో మనుష్యులు చాలా కొద్ది మంది ఉంటారు. సుమారుగా లక్షల్లో ఉంటారు. యమునా తీరంలో రాజధాని ఉంటుంది. అక్కడ ఏ వికారము ఉండనే ఉండదు. వారిని సంపూర్ణ నిర్వికారులు అని అనడం జరుగుతుంది. పిల్లలు కూడా యోగబలంతోనే జన్మిస్తారు. అక్కడ ఏడుపులు, పెడబొబ్బలు ఏవీ ఉండవు. కానీ మొదటే ఈ విషయాలను ఎత్తకూడదు. మొదట ఈ విషయాన్ని అడగండి - నిరాకార పరమపిత పరమాత్మ మరియు ఆత్మలమైన మనం కూడా పరలోకం నుండి వస్తాము, మరి పారలౌకిక పరమపితతో మీకు ఏం సంబంధం ఉంది? నంబరువన్ విషయము ఇది. మొదట ఈ తండ్రి సంబంధం గురించి అర్థం చేయించాక, అప్పుడు తల్లి మరియు వారసత్వాల సంబంధం కూడా వస్తుంది. ఒక్క భగవంతుడిని మర్చిపోవడంతోనే అంతా మర్చిపోయారు. రావణుడు మొట్టమొదట భగవంతుడినే మరపింపజేసాడు, మళ్ళీ భగవంతుడి సహాయంతో మనం రావణుడిపైన విజయం పొందుతాము. అర్థం చేయించాల్సిన పాయింట్లు అయితే చాలా ఉన్నాయి. ప్రదర్శినీలో ముఖ్యంగా భగవంతుడి గురించే అర్థం చేయించాలి. భగవంతుడి తర్వాతే, వారసత్వము, మిగతా విషయాలు వస్తాయి. ఎంతగా తల బాదుకున్నా సరే, భగవంతుడిని అర్థం చేసుకోకపోతే, ఇంకేమీ అర్థం చేసుకోరు. వారు పరమపిత, కావున తండ్రి నుండి వారసత్వం లభిస్తుంది. బాబా నుండి వారసత్వం లభించినట్లయితే, వారసత్వానికి హక్కుదారులుగా తప్పకుండా అవుతారు. త్రిమూర్తిపై అర్థం చేయించడం ఎంత సహజము. పైన తండ్రి ఉన్నారు, కింద వారసత్వమైన లక్ష్మీ-నారాయణులు అనగా విష్ణువు నిలబడి ఉన్నారు. బాబా అంటారు, నన్ను స్మృతి చేసినట్లయితే ఈ వారసత్వాన్ని పొందుతారు. పిల్లలు అంటారు, బాబా, మీరైతే నిరాకారుడు, మీరు ఎలా వారసత్వాన్ని ఇస్తారు. పిల్లలూ, నేను ఈ బ్రహ్మ ద్వారా ఇస్తాను. ఎవరు వచ్చినా, వారికి ఈ విషయం గురించి అర్థం చేయించండి. ముఖ్యమైన విషయం త్రిమూర్తులదే. త్రిమూర్తి బ్రహ్మ అనే మాటకైతే అర్థమే లేదు. వారు నిరాకార శివబాబా, వారినే జ్ఞానసాగరుడని అంటారు అని అర్థం చేయించాలి. ఆ తర్వాత ఇది వారసత్వము. ఇప్పుడు తండ్రి అయితే నిరాకారుడు. మరి ఈ లక్ష్మీ-నారాయణులకు వారసత్వం ఎలా లభించింది, ఎక్కడ నుండి వచ్చింది? మీరు ఇక్కడ స్వయాన్ని విష్ణు కుమారులుగా చెప్పుకోరు. మీరు ఉన్నదే బి.కె.లు. బ్రహ్మపురి మనుష్యులకు చెందినదే. అక్కడ ముఖ్యంగా బ్రాహ్మణులను రచిస్తారు. సింధ్ లో కూడా బ్రహ్మపురి ఉండేది, ఇది ఎవరు అర్థం చేయించారు? (శివబాబా) సదా బాప్ దాదా అని కంబైండుగా చెప్పాలి. ఒక్కోసారి బాబా, ఒక్కోసారి దాదా మాట్లాడుతారు. ఇరువురి ఆత్మలకు నోరు అయితే ఒక్కటే కదా. ఎప్పుడు ఎవరికి కావాలంటే, వారు ఉపయోగిస్తారు. బంధనం ఏమైనా ఉందా. కావున మొదటి విషయం ఏమిటంటే, జ్ఞానసాగరుడు, గీతా భగవంతుడు తండ్రి. వారు అంటారు - ఈ బ్రహ్మ, విష్ణు, శంకరులైతే సూక్ష్మవతనవాసులు, దేవతలు. ఈ బ్రహ్మ అయితే మనిషి, ఎప్పుడైతే సంపూర్ణమవుతారో, అప్పుడు దేవత అని అనబడతారు. వీరు తపస్య చేసిన తర్వాత దేవతగా అవుతారు. ఈ బ్రహ్మకుమార-కుమారీలకు భగవంతుడు బ్రహ్మ ద్వారా నేర్పిస్తారు. చిత్రాలపై మంచి రీతిలో అర్థం చేయించాలి. వివరణ చాలా సహజమైనది. వీరు శివబాబా, ఇది వారసత్వము. ఈ శివుడైతే నిరాకారుడు, అందుకే బ్రహ్మ ద్వారా ఇస్తారు. బ్రహ్మ ద్వారా స్వర్గం యొక్క స్థాపన. ఇలా తయారవ్వడానికి తప్పకుండా ఇప్పుడే రాజయోగాన్ని నేర్పిస్తారు. ఇది

శివపురి, ఇది విష్ణుపురి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1.భగవంతుని స్మృతితో మాయ రావణునిపై విజయం పొందాలి. అందరికీ భగవంతుడి యొక్క పరిచయాన్ని ఇవ్వాలి.

2. స్మృతి యాత్రలో అలసిపోకూడదు. తమ బ్యాటరీని చార్జ్ చేసుకునేందుకు సర్వశక్తివంతుడైన తండ్రిని స్మృతి చేయాలి.

వరదానము:- ఒక్క తండ్రి స్మృతి ద్వారా ఏకరస స్థితిని అనుభవం చేసే సార స్వరూప భవ

ఏకరస స్థితిలో ఉండేందుకు సహజమైన విధి ఒక్కరి స్మృతి. ఒక్క బాబా తప్ప ఇంకెవ్వరూ లేరు. ఎలాగైతే బీజంలో అంతా ఇమిడి ఉంటుందో, అలా తండ్రి కూడా బీజము, వీరిలో సర్వ సంబంధాల, సర్వ ప్రాప్తుల సారము ఇమిడి ఉంది. ఒక్క తండ్రిని స్మృతి చేయడము అనగా సార స్వరూపులుగా అవ్వడము. కనుక ఒక్క తండ్రి తప్ప ఇంకెవ్వరూ లేరు - ఈ ఒక్కరి స్మృతి ఏకరస స్థితిని తయారుచేస్తుంది. ఎవరైతే ఒక్క సుఖదాత తండ్రి స్మృతిలో ఉంటారో, వారి వద్దకు దుఃఖపు అల ఎప్పుడూ రాలేదు. వారికి స్వప్నాలు కూడా సుఖం, సంతోషం, సేవ మరియు మిలనం జరుపుకోవడానికి సంబంధించినవే వస్తాయి.

స్లోగన్:- శ్రేష్ఠ ఆశల దీపాన్ని వెలిగించేవారే సత్యమైన కుల దీపకులు.

మాతేశ్వరిగారి అమూల్యమైన మహావాక్యాలు

“పరమాత్మ ద్వారా ఫస్ట్ లాటరీని ఎందుకు గెలుచుకోకూడదు”

చూడండి, చాలామంది మనుష్యులు ఎలా భావిస్తారంటే, కొద్దిగా పురుషార్థం చేసినా సరే, మేము కూడా వైకుంఠంలోకి వచ్చేస్తాము కదా అని. కానీ వారు ఇలా ఆలోచించాలి, పరమాత్మ తండ్రి వచ్చారంటే పూర్తి వారసత్వాన్ని తీసుకోవడానికి విద్యార్థి పని ఏమిటంటే, సంపూర్ణ పురుషార్థం చేసి స్కాలర్షిప్ తీసుకోవడము, మరి మొదటి నంబరు లాటరీని ఎందుకు గెలుచుకోకూడదు! అదేమిటంటే, విజయమాలలో కూర్చబడడము. మిగిలినవారు రెండు లడ్డూలు పట్టుకుని కూర్చున్నారు, ఇక్కడి హద్దు సుఖము కూడా తీసుకుంటాను మరియు అక్కడ వైకుంఠంలో కూడా ఏదో ఒక సుఖాన్ని అయితే తీసుకుంటానులే అని. ఇలా ఆలోచించేవారిని మధ్యమ మరియు కనిష్ఠ పురుషార్థి అని అంటారు, అంతేకానీ సర్వోత్తమ పురుషార్థి అని అనరు. తండ్రి ఇవ్వడంలో వెనుకాడనప్పుడు తీసుకునేవారు ఎందుకు తప్పించుకుంటారు? అందుకే గురునానక్ అన్నారు, పరమాత్మ అయితే దాత, సమర్థుడు కానీ ఆత్మలకు తీసుకునే శక్తి కూడా లేదు, ఇచ్చేవారు ఇస్తారు కానీ తీసుకునేవారు అలసిపోతారు. మేము కూడా ఈ పదవి పొందాలని ఎందుకు కోరుకోకూడదు అని మీ మనసులో ఆలోచన వస్తూ ఉండవచ్చు. కానీ, బాబా ఎంత శ్రమ చేస్తున్నారో చూడండి, అయినా కూడా మాయ ఎన్ని విఘ్నాలను వేస్తుంది, ఎందుకు? ఇప్పుడు మాయ రాజ్యం సమాప్తమవ్వనున్నది. ఇప్పుడు మాయ మొత్తం సారాన్ని తీసేసింది, అప్పుడే పరమాత్మ వస్తారు, వారిలో అన్ని రసాలు ఇమిడి ఉన్నాయి, వారి ద్వారా సర్వ సంబంధాల రసము లభిస్తుంది, అందుకే త్వమేవ మాతాశ్చ పితా... మొదలైన ఈ మహిమ ఆ పరమాత్మదే. కనుక ఇటువంటి సంబంధం ఏర్పడిన ఈ సమయానిదే బలిహారము అచ్ఛా - ఓంశాంతి.